హరిబాబుది అక్రమ అరెస్ట్

- మేము అడిగితేనే అప్పటి ఎమ్మెల్యే రోడ్డు వేశారు
- ఆయనకు ఎలాంటి సంబంధం లేదు
- సుధీర్‌కుమార్, గండ్రకు వినతిపత్రం అందజేసిన కాశీంపల్లి రైతులు

బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాశీంపల్లి రైతులు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 20 : భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని కాశీంపల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో 100 మంది రైతులు నల్ల బ్యాడ్జీలు ధరించి, హరిబాబు జైలు నుంచి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు పూసల రవీంద్రాచారి, అమరగొండ భిక్షపతి మాట్లాడుతూ గతంలో కాశీంపల్లిని పట్టించుకున్న నాయకుడు లేడని, తమ వ్యవసాయ భూముల వద్దకు బురదలో నానా ఇబ్బందులు పడుతూ వెళ్లేవాళ్లమని, వర్షాలు పడితే కనీసం కుర్తిఒర్రె వరకు కూడా నడిచేవాళ్లం కాదని, తద్వారా పెద్దమొత్తంలో పంట నష్టం జరిగేదన్నారు. ఈ క్రమంలో తమ విజ్ఞప్తి మేరకు అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వ నిధులతో రోడ్డు వేయించారని, దీనికి, హరిబాబుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. హరిబాబు తమ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, దానిని జీర్ణించుకోలేని కొంతమంది అధికార పార్టీ నాయకులు ఊరువిడిచి వెళ్లిపోయిన వ్యక్తిని తీసుకొచ్చి అక్రమ కేసు పెట్టించారన్నారు. నమ్మి కాంగ్రెస్‌కు ఓటువేస్తే తమపై, తమ గ్రామానికి చెందిన హరిబాబుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హరిబాబుపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకొని, ఆయనను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ కనుసన్నల్లో అధికారులు పనిచేస్తూ బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి జైలుకు పంపుతున్నారని అన్నారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఎన్ని కుట్రలు చేసినా, అక్రమ కేసులు పెట్టినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని, పార్లమెంట్ ఎన్నికల తరువాత అధికార పార్టీ మోసాలపై నిలదీసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు బొంతల రాజు, ప్రభాకర్, పులి రవి, కొత్త సతీశ్, బొంతల సమ్మయ్య, మేక మల్లయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 20 : భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పారిశుధ్య పనుల ప్రగతిపై మున్సిపల్, సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్, సింగరేణి మధ్య సమన్వయ లోపంతో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. సింగరేణి పరిధిలోని ఆవాసాల్లో పారిశుధ్య పనుల బాధ్యత ఆ సంస్థదేనని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం నుంచి కమిషనర్ అన్ని వార్డుల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనులు తనిఖీ చేయాలని, ఎక్కడైనా వ్యర్థాలుంటే ఫైన్ వేయాలని ఆదేశించారు. రామప్పకాలనీకి వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయని, వెంటనే తొలగించాలని సింగరేణి అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను ప్రతిరోజూ సేకరించాలని, వ్యర్థాలు ఆరు బయట వేస్తే జరిమానా విధించాలన్నారు. దుకాణాల ముందు వ్యర్థాలు వేయొద్దని వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, సింగరేణి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

మిషన్‌భగీరథ పైపులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 20 : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కాటారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుందా? లేదా? అని ప్రజలను అగిడి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, జీపీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ తాగునీరందేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు వేసవిలో నీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నల్లా కనెక్షన్‌లో కంట్రోల్ వాల్వ్‌లను తొలగించినట్లు తన దృష్టికి వచ్చిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డీఎల్‌పీవో వీరభద్రం, ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, మిషన్ భగీరథ అధికారులు, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి మాధవి

బాలసదనంలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

సీనియర్ సివిల్ జడ్జి టీ మాధవి

ములుగురూరల్, ఏప్రిల్ 20 : అనాథ పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాలసదనంలో సౌకర్యాలు మెరుగుపర్చాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ మాధవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని ఆమె సందర్శించి అధికారులతో మాట్లాడారు. అనాథలు, పాక్షిక అనాథలకు అందుతున్న సౌకర్యాలు, సమకూర్చిన వసతులను తెలుసుకున్నారు. ఆమె వెంట బాలల సంరక్షణ అధికారి ఓంకార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ నరేశ్, సూపరింటెండెంట్ సుమతి, రక్షణ అధికారి కృష్ణవేణి, కౌన్సిలర్ రాణి ఉన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 20 : హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా డిప్లొమాలో చేరేందుకు వీరు అర్హులన్నారు. ఆసక్తి గల జిల్లాలోని బాలికలు తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, బోనఫైడ్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్ ప్రతులు జతపరిచి మే 20లోగా మంజూర్‌నగర్‌లోని బాలరక్షక భవన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9440779422, 9848416376 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

మావోయిస్టు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

చిట్యాల, ఏప్రిల్ 20 : ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మండలంలోని చల్లగరిగకు చెందిన మావోయిస్టు నేత సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్రావు, అతని భార్య సుమన అలియాస్ రజిత మృతి చెందగా శనివారం వారి కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని సుధాకర్ తల్లి రాజపోశమ్మకు భరోసానిచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, రాష్ట్ర నాయకులు రామ్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు కే రత్నాకర్‌రెడ్డి, కే మంజులా అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ములుగు జిల్లాలో చిరు జల్లులు

ములుగురూరల్, ఏప్రిల్ 20 : జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం చిరు జల్లులు కురిశాయి. రెండు నెలలుగ భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కాగా, శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. దీంతో ఎండ వేడిమి నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. వాతావరణ మార్పులతో అకాల వర్షాలు పడుతాయేమనని రైతులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళ వర్షం కురిస్తే ధాన్యం తడవ కుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీవో ప్రసాద్

మహదేవపూర్, ఏప్రిల్ 20 : ఆయా జీపీల ఆధ్వర్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని ఎంపీవో ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లి జీపీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీపీలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. మొక్కలకు సకాలంలో నీరందించాలని, ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తొలగించాలని సూచించారు. ప్రతి నర్సరీలో షేడ్ నెట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, జీపీ సిబ్బంది రంజిత్, తదితరులున్నారు.

చెరువులో చేపలు మృత్యువాత



మృతి చెందిన చేపలు

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 20 : కాటారం మండలం చింతకానిగూడెపు చెరువులో శనివారం చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ చెరువు కింద సాగు చేస్తున్న పంట పొలాలకు రైతులు నీరు వాడుకుంటున్నారు. దీంతో పాటు ఎండ తీవ్రతకు క్రమంగా నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు నీటి ఉష్ణోగ్రత పెరిగి చేపలు మృతి చెందినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వేల సంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు రావడం పలువురిని కలిచివేసింది.

నంబర్ ప్లేట్స్ లేని వాహనాల సీజ్

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 20 : కాటారం మండలంలో నంబర్ ప్లేట్స్ లేని పలు వాహనాలను శనివారం పోలీసులు సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా నంబర్ ప్లేట్స్‌ను బిగించాలని ఎస్సై అభినవ్ తెలిపారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక లారీల సీజ్

వాజేడు, ఏప్రిల్ 20 : మండలంలోని చీకుపల్లి, ధర్మవరం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి వేర్వేరుగా వాహనలు తనిఖీలు చేస్తున్న వాజేడు, పేరూరు ఎస్సైలు చావళ్ల వెంకటేశ్వర్‌రావు, గొర్ల రమేశ్ అతివేగంగా వస్తున్న ఇసుక లారీలను ఆపి తనిఖీ చేశారు. ప్రభుత్వ డీడీ ప్రకారం కంటే ఐదు టన్నులు అధికంగా లోడ్ ఉన్నట్లు గుర్తించి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బోనాల ప్రశాంత్‌పై కేస్ నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. అలాగే మరో మూడు లారీలను వాజేడు ఎస్సై తనిఖీచేయగా ఒక్కో లారీలో మూడు టన్నులకు పైగా ఇసుకు ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేసి, డ్రైవర్లు ఊరుకొప్పుల దస్తగిరి, నిమ్మల సాయి, గడ్డం వినయ్‌పై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన నాలుగురు లారీలు వాజేడు మండలంలోని అయ్యవారిపేట ఇసుక ర్యాంపునకు చెందినవిగా పోలీసులు తెలిపారు.

కోటగుళ్ల గోశాలకు దాణా వితరణ

దాణా బస్తాలు అందజేస్తున్న డాక్టర్ దంపతులు

గణపురం, ఏప్రిల్ 20 : కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు మండల కేంద్రానికి చెందిన వినయ్ హాస్పిటల్స్ నిర్వాహకులు చెలుమల్ల సంపత్-స్వరూప దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దాణా బస్తాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేశ్ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

బాధితులకు ఫోన్ల అందజేత

వాజేడు, ఏప్రిల్ 20 : మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన అశ్విన్‌కుమార్, పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్ సెల్‌ఫోన్లు మార్గమధ్యంలో పడిపోవడంతో వాజేడు పోలీసుస్టేషన్‌లో గత సంవత్సరం నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఐఎమ్ఈ నంబర్ల ఆధారంగా వాటిని కనుగొన్న పోలీసులు శనివారం ఎస్సై చావళ్ల వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. వాటి విలువ రూ.45 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 20 : మండలంలోని అలుబాక పంచాయతీ పరిధి ముత్తారం గ్రామానికి చెందిన మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శశికళ (25) వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

గోవిందరావుపేట, ఏప్రిల్ 20 : గ్రామాల్లో గుడుంబా తయారు చేయడంతో పాటు రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని ములుగు ఎక్సైజ్ సీఐ ఎం సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని పాపయ్యపల్లి, బాలాజీనగర్, సంద్రగూడెం, మాన్యతండా, రాంనగర్ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 110 కిలోల బెల్లం, 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లింగయ్యగౌడ్, శివ, ఎస్టీఎఫ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు ధైర్యంగా లొంగిపోవాలి

ములుగు ఎస్పీ పీ శబరీశ్

ములుగురూరల్, ఏప్రిల్ 20 : మావోయిస్టులు అడవులను వీడి ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోయి ప్రభుత్వ పునరావాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మావోయిస్టుల కుటుంబాలను పోలీస్ అధికారులు కలిసి ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుత పరిస్థితులు వివరించి పార్టీలో పనిచేస్తున్న తమ కుటుంబ సభ్యులు లొంగిపోవాలని అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలోని బడే చొక్కారావు కుటుంబాన్ని, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సాంబయ్య, ములుగు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కనుకుంట్ల రాజు, ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన ఎస్ఎం అర్జున్ కుటుంబాలను పోలీసులు కలిశారన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు వివరించారు. మావోయిస్టు సిద్ధాంతాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అగ్ర నాయకులు వారి కుటుంబ సభ్యుల పరిస్థితులను తెలుసుకొని పోలీసుల ముందు లొంగిపోవాలని సూచించారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేను అడ్డుకున్న రైతులు

తహసీల్దార్‌తో వాగ్వాదం
మార్కెట్ రేటుకు రెండు రెట్లు చెల్లించాలని డిమాండ్

తహసీల్దార్ సునీతతో వాగ్వాదం చేస్తున్న రైతులు

చిట్యాల (మొగుళ్ళపల్లి), ఏప్రిల్ 20 : మంచిర్యాల-వరంగల్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి సర్వేను శనివారం రైతులు అడ్డుకున్నారు. 108.406 కిలో మీటర్ల పొడవైన ఈ నాలుగు వరుసల రహదారి మొగుళ్లపల్లి మండల కేంద్రం శివారు నుంచి వెళ్తున్నది. ఈ క్రమంలో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు శనివారం భూసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తమ భూములు లాక్కోడం సరికాదని, భూమి ఉంటేనే బతుకు బాగుంటుందని కొంత మంది రైతులు సర్వేను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ సునీతను వారు వాగ్వాదానికి దిగడంతో ఆమె ప్రభుత్వ నిబంధనలను వివరరించారు. సర్వేను అడ్డుకోవడం సరికాదని, తమకు సహకరించాలని, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. అయినా వారు వినకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతులు మాట్లాడుతూ మార్కెట్ రేటుకు రెండు రెట్లు చెల్లించినట్లయితే సహకరిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంటే తమకు చావే శరణ్యమన్నారు.

తమకు జీవనాధారమైన భూమి పోతే బతికేదెట్లా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మార్కెట్ రేటును పరిగణనలోకి తీసుకొని పరిహారం అందించాలని, లేనిపక్షంలో సర్వే జరగనివ్వమని రైతులు హెచ్చరించారు.

తవ్వకాల్లో బయటపడ్డ పురాతన పెంకు

బయటపడిన పురాతన కుండ పెంకు

తాడ్వాయి, ఏప్రిల్ 20 : మండలంలోని దామెరవాయి రాక్షస గుహల సమీపంలోని ఊరు చెరువు మట్టి తవ్వకాల్లో శనివారం పురాతన కుండ పెంకు బయటపడినట్లు గ్రామ టార్చ్ టీమ్ ఆఫ్ రిసెర్చ్ అండ్ కల్చర్ సంస్థ సభ్యుడు, గ్రామ అన్వేషకుడు కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతున్న క్రమంలో కుమ్మరి చక్రంపై తయారు చేసి కాల్చిన ఎరుపు రంగు కుండ పెంకు బయటపడిందని తెలిపారు. చరిత్ర పరిశోధకులు రామోజు హరిగోపాల్, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, తెలంగాణ యువ చరిత్రకారుడు, టార్చ్ సంస్థ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆర్య పకిడేలు పరిశీలించి పురాతన పెంకుగా గుర్తించారన్నారు. పెంకుపై రెండు గీతల మధ్య గోటి నొక్కు వంటి డిజైన్, ఒక వృత్తంపై మరో వృత్తం గీసి ఉందని, అప్పటి కుమ్మరుల పనితనం కొట్టచ్చినట్లు కనిపిస్తుందని తెలిపారు. ఈ గుర్తుల ఆధారంగా ధాన్యాన్ని నిల్వ చేసే 'కాగు' అయి ఉంటుందని చెప్పారు. పురావస్తు శాఖ ఇక్కడ తవ్వకాలు చేపడితే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని వివరించారు.

ఘనంగా సీతారాముల శోభాయాత్ర

నిర్వహించిన శోభయాత్ర

ఏటూరునాగారం, ఏప్రిల్ 20 : మండలకేంద్రంలో సీతారామ చంద్ర స్వామి శోభాయాత్రను శనివారం రాత్రి నిర్వహించారు. ఐదు రోజుల పాటు కన్నుల పండువగా శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి రామాలయం నుంచి ప్రధాన వీధుల వెంట శోభయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ, నిర్వాహకులు అలువాల శ్రీనివాస్, గాడి చర్ల సాంబయ్య, పోగుల లక్ష్మీనారాయణ, దీనభాందవస్వామి పాల్గొన్నారు.

దేవాదుల పంపింగ్ ప్రారంభం

కన్నాయిగూడెం, ఏప్రిల్ 20 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఒక మోటర్ ద్వారా గోదావరి నీటి పంపింగ్‌ను శనివారం ప్రారంభించారు. ఫేస్-2 లోని ఒక మోటర్ ఆన్‌చేసి 247 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుద శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 75.20 మీటర్ల ఎత్తుకు చేరింది. ఎగువ నుంచి 300 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో బరాజ్ ఒక గేటును స్వల్పంగా పైకెత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

చల్వాయిలో న్యాయ సేవా సదస్సు

గోవిందరావుపేట, ఏప్రిల్ 20 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చల్వాయి గ్రామంలో న్యాయ సేవా సదస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ మాట్లాడుతూ గ్రామంలో రైతుల సమస్యలపై న్యాయ సేవా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉచిత న్యాయం కోసం రూపొందించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బానోతు స్వామిదాస్, రాజ్‌కుమార్, శేఖర్, గ్రామస్తులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న వాజేడు ఎస్సై వెంకటేశ్వర్లు

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

వాజేడు, ఏప్రిల్ 20 : మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద ఉన్న 163 జాతీయ రహదారిపై శనివారం ఎస్సై చావళ్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే బస్సులు, వాహనాల్లో సోదాలు చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మండలంలోని పస్రా సరిహద్దు ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఎస్సై కమలాకర్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 20 : పంటలు ఎండిపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన (ఏఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీ నవనిర్మాణ సేన బృందం పాలెం ప్రాజెక్టు కింద ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ పాలెం ప్రాజెక్టును నమ్ముకుని రైతులు వందల ఎకరాల పంటలు సాగు చేశారని అన్నారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులో నీరు వృథాగా పోయిందని తెలిపారు. ఎండిన పంటలను సర్వే చేసి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇర్పబాబు, శివ, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

ములుగు, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకుండా ప్రజలకు నాణ్యమైన కరంటు ఇవ్వాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల ఆపరేషన్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. డీఈలు, ఏఈలు, ఏఎల్ఎంలు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఫోర్‌మెన్‌లు, బాధ్యతతో పనిచేస్తూ విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ చర్యలు త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ సాయికృష్ణ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

డాక్యుమెంట్స్ పోయినవి
నేను అనగా బజ్జూరి లక్ష్మి C/o గ్రా॥ తిడుగు. నాకు శివనగర్ (వరంగల్)లో ఇల్లు ఉన్నది. ఇ.నెం. 16-9-273/1, డా.నెం. 5730/07 ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్స్ జఫర్‌గడ్ నుంచి హన్మకొండకు వెళ్లే దారిలో ఎక్కడో పోయినవి. కావున దొరికిన వారు వెంటనే క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Call: 9502593647

మహిళలకు శుభవార్త
★గిజుబాయ్ సెట్విన్ వారి 10 రోజుల వేసవి PPTTC ట్రైనింగ్ ప్రోగ్రాం. ప్లేవే మెథడ్ బోధన. లిమిటెడ్ సీట్లు, Govt. Certificate. 100% Job Placement అవకాశం. Offordable Fee. తేదీలు: 2, మే నుండి 11, మే వరకు. సెల్: 7382733795, హనుమకొండ.
NTW-000

ఆదిత్య శ్రీ రియల్టర్స్ & డెవలపర్స్
★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ, ఇళ్ళ స్థలాలను గానీ, వ్యవసాయ స్థలాలను గానీ మాకు డెవలప్‌మెంట్‌కి ఇవ్వండి మీరు ఆశించినంత పొందండి సంప్ర: 9394326111, 7981174745.
NTW-323040

శ్రీకృష్ణ ఆయుర్వేదిక్ క్లినిక్ & మెడికల్ స్టోర్స్
★ కన్సల్టేషన్ సమయం: ప్రతి రోజు సా॥ 5 గం.ల నుండి 8.30 ని.ల వరకు మరియు ప్రతి ఆదివారం ఉ॥ 10 గం.ల నుండి రా॥ 8.30 ని.ల వరకు. Dr. A. APARANJI MD (Ayu), Cell: 8106820311, 9676729606
NTW-000

CHANGE OF NAME
★I, Aluvala Ilaiah S/o Chandraiah, Age 38 years, Occ: Teacher, Pedda Mupparam Village, Danthalpally Mandal, Mahabubabad District of Telangana State-506324, have changed/corrected my name from ALUVALA ILAIAH to "ALUVALA BHARGUV CHANNDRA" for all my records purposes.
NT-2336

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

HEALTH CARE
★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. సంప్ర॥ 6281476205, 9440325526
KMM_11634

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565